క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



నిజామాబాద్అర్బన్: నగరంలోని కోటగల్లి జీపీఎస్ ప్రాథమిక పాఠశాల పీఎస్ హెచ్ఎం గా రామ్ చందర్ గైక్వాడ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన జెండాగల్లీ పాఠశాల నుంచి బదిలీపై వచ్చారు. సెప్టెంబర్ 2023లో బదిలీ అయిన ఉపాధ్యాయులను విద్యాశాఖ రిలీవ్ చేయకుండా ఇన్ని రోజులు ఆపింది. తాజాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రిలీవ్ చేయడంతో జెండాగల్లీ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న రామచందర్ గైక్వాడ్ శుక్రవారం మధ్యాహ్నం రిలీవ్ అయి కోటగల్లీలో జాయిన్ అయ్యారు.

విద్యార్థులకు అవగాహన



నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవనగర్లో చిన్నారులకు బాల సంఘం ఆధ్వర్యంలో చదువుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు,పెద్దలతో క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలసంఘం సభ్యులు,విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



సిరికొండ: మండలంలోని కొండాపూర్లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు శనివారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన కిశోర్గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ శ్రీధర్, కిరణ్, ఆకుల జగన్, మాజీ సర్పంచ్ రమేష్, మహేష్గౌడ్, మోహన్, సుదర్శన్గౌడ్, చందర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు



ఇందల్వాయి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులను ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్ శనివారం తనిఖీ చేశారు. ప్రతి హాస్పిటల్కు అగ్నిమాపక శాఖ అనుమతి ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య పరికరాలను తనిఖీ చేసి బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ వ్యవస్థని ఏర్పాటు చేసుకోవాలన్నారు. అధిక ఫీజులు వసూలు చేయొద్దని, రోగులకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు.

కల్కి భగవతి భగవానుల కల్యాణం



నిజామాబాద్ అర్బన్ : నగరంలోని అమ్మ భగవాన్ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ కల్కి భగవతి భగవాన్ల కల్యాణ మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ సతీమణి ధన్పాల్ మణిమాల కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

సొసైటీ చైర్మన్కు పరామర్శ



సిరికొండ: సిరికొండ పీఏసీఎస్ చైర్మన్ చెల్లెం గంగాధర్ను రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్బిన్ హందాన్ శనివారం రాత్రి పరామర్శించారు. మండలంలోని కొండూర్ గ్రామంలో చైర్మన్ సోదరి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన పరామర్శించారు. సురేష్రెడ్డి, సదానంద్రెడ్డి, భాస్కర్రెడ్డి, రవీందర్రెడ్డి తదితరులు ఉన్నారు.

హోటళ్లలో తనిఖీలు షురూ..

- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- కుళ్లిన ఆహారం గుర్తింపు

నిజామాబాద్ నాగారం: ఆహార భద్రత అధికారులు ఎట్టకేలకు కదిలారు. నగరంలోని హోటళ్లలో తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలోని చాలా హోటళ్లలో ఆహారం కలుషితం అవుతుందనేది బహిరంగ రహస్యం. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా వినియోగదారులకు అధ్వానమైన ఆహారం అందిస్తున్నారు. దీనిపై పలుమార్లు ఆహార భద్రతశాఖ అధికారులు ఫిర్యాదులు వెళ్లినా పట్టించుకోలేదు. తాజాగా జిల్లాలోని హోటళ్లలో అధికారులు దాడులు చేస్తున్నారు. రాష్ట్ర ఫుడ్సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో టాస్క్ఫోర్స్ బృందం శనివారం తనిఖీలు చేపట్టింది.



హోటల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

కుళ్లిన మాంసంతో వంటలు

ఫుడ్సేఫ్టీ టాస్క్ఫోర్స్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎంఎ ఖలీల్ బృందం ఆధ్వర్యంలో నగరంలో హైదరాబాద్ రోడ్లో గల పలు హోటళ్లలో శనివారం తనిఖీలు చేపట్టింది. హోటళ్లలో నిల్వ ఉంచిన కుళ్లిన మాంసాన్ని వండుతున్నట్లు గుర్తించారు. నగరంలో చాలా రెస్టారెంట్లల్లో ఇదే పరిస్థితి నెలకొంది. నగరంలోని అరోమా హోటల్లో అధికారులు వంటశాలలను పరిశీలించారు. నిల్వ ఉంచిన చికెన్, ఫిష్, మాంసం, కలరు వాడిన బిర్యానిని అధికారులు స్వాధీనం చేసుకొని చెత్త బుట్టలో వేశారు. ఇలా పలు హోటళ్లలో తనిఖీలు చేస్తున్నారు.

దాడులతో మార్పు వచ్చేనా!

కొన్నేళ్లుగా జిల్లాలో ఫుడ్సేఫ్టీ అధికారులు దాడులు చేసిన ఘటనలు లేవు. కనీస నిబంధనలు పాటించకుండానే హోటళ్లలను నిర్వహిస్తున్నారు. వినియోగదారులను మోసం చేస్తున్న విషయం అధికారులు తెలిసినా మాముళ్లు తీసుకోని మామా అనిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా అధికారుల తనిఖీలతో హోటళ్ల నిర్వాహకుల్లో మార్పు వచ్చేనా అని పలువురు చర్చించుకుంటున్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో కుంకుమార్చనలు



ఆలయంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

మోపాల్: నగర శివారులోని బోర్గాం(పి) సమీపంలో గల లక్ష్మీగణపతి ఆలయంలో శ్రీసూక్త సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞంలో భాగంగా రెండో రోజు శనివారం శ్రీ చక్రానికి కుంకుమార్చనలు నిర్వహించారు. స్థాపిత దేవతలకు నిత్యార్చనలు, హోమాలు, శ్రీ సూక్త పారాయణం, యజ్ఞం, తర్పణములు చేపట్టారు. సాయంత్రం కుంకుమార్చనలు, నైవేద్యం, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల కోసం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఆదివారం నిత్యార్చనలు, సాముహికంగా శ్రీసూక్త యజ్ఞం, సిద్ధి బుద్ధి గణపతి కల్యాణం తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు అరుణ్కుమార్ శర్మ తెలిపారు.



అలంకరణలో స్వామివారు

అలరించిన కవి సమ్మేళనం

మోపాల్: బోర్గం శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో శనివారం సాయంత్రం జరిగిన భక్తి కవి సమ్మేళనం ఆకట్టుకుంది. సుమారు 28 మంది కవులు తమ రచనలను, భక్తి భావాలను కవితా రూపంలో ఆవిష్కరించారు. ఆలయ ప్రధాన అర్చకులు అరుణ్కుమార్శర్మ మాట్లాడుతూ భక్తితోనే ముక్తి సాధ్యమన్నారు. డాక్టర్ గణపతి అశోకశర్మ, కాసర్ల నరేష్రావు, జనగామ చంద్రశేఖర్శర్మ, చిన్న శంకర్, యాదగిరి, వేణుగోపాల్ పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న కవులు

గుంతలమయంగా రోడ్లు





మాధవనగర్లో గుంతలమయంగా ఉన్న రోడ్లు

- మాధవనగర్లో అధ్వానంగా అంతర్గత దారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని నాలుగో డివిజన్ మాధవనగర్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. కాలనీల్లోని సీసీ రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయి. రోడ్లపక్కన చెత్తాచెదారం పేరుకుపోతోంది. వర్షాకాలం ప్రారంభం అయినందునా రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. పరిసరాలు అధ్వానంగా ఉండటంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోని గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో బడిబాట

వేల్పూర్: మండల కేంద్రంలో స్థానిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాలను వివరించారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తే రూ. వేల ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే ఎలాంటి ఫీజులు కట్టాల్సిన అవసరం లేదన్నారు. విద్యార్థులకు అవసరమైన నోట్బుక్స్, పాఠ్యపుస్తకాలు, దుస్తులు ఉచితంగా లభిస్తాయన్నారు. మధ్యాహ్న భోజనం, ఉపకార వేతనం కూడా వస్తుందని తల్లిదండ్రులకు తెలిపారు. అనంతరం నూతనంగా 10 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఉపాధ్యాయులు బోడ దేవానందం, వనిత, శారద, వెంకటేశ్వర్, రవికుమార్, ఆశా వర్కర్లు కవిత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రెంజల్లో..

రెంజల్: స్థానికంగా అందుబాటులో ఉండే ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని దూపల్లిలో ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతు ప్రచారం నిర్వహించారు. శనివారం 'బడిబాట'లో భాగంగా గ్రామంలో తిరుగుతూ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఉన్న వ్యత్యాసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమలింగంగౌడ్, సాయారెడ్డి, ఇన్చార్జి హెచ్ఎం వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు సాయన్న, శ్రీనివాస్, లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు.



వేల్పూర్లో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..

బోధన్టౌన్: పట్టణంలోని 10 వార్డులో ఉన్న గోసం బస్తీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో జానకి మాట్లాడారు. ఐదేళ్ల లోపు ఉన్న పిల్లలను ప్రైమరీ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ర్యాలీలో సూపర్ వైజర్ రాధిక, అంగన్వాడీ టీచర్లు విక్టోరియా, రాణి, సరోజ, రత్నం తదితరులు ఉన్నారు.

ఏడు నెలల నిరీక్షణకు తెర

రుద్రూర్: ఏడు నెలల క్రితం బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు శనివారం రిలీవ్ అయ్యారు. సుదీర్ఘ కాలంగా మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు గత ఏడాది అక్టోబర్లో బదిలీలు జరిగాయి. ఎస్జీటీల పదోన్నతులు నిలిచిపోవడంతో వీరు పని చేస్తున్న పాఠశాలకు మరోకరు రానందున పాత పాఠశాల నుంచి రిలీవ్ కాలేదు. దీంతో బదిలీ అయిన పాఠశాలకు పంపాలని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో పాత పాఠశాలల్లోనే పని చేస్తున్నారు. ఎట్టకేలకు బదిలీ ప్రక్రియ ప్రారంభం కావడంతో ఏడు నెలల క్రితం బదిలీ అయిన ఉపాధ్యాయులను శనివారం రిలీవ్ చేశారు. కోటగిరి ఉమ్మడి మండలంలో 25 మంది, రుద్రూర్ మండలంలో నలుగురు ఉపాధ్యాయులు రిలీవ్ అయినట్టు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

ఎరువుల దుకాణం తనిఖీ



రెంజల్: మండలంలోని సాటాపూర్లో ఉన్న రెండు ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం రాత్రి పోలీసులు, ఏవో తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ను పరిశీలించి ఎరువుల బస్తాలను తనిఖీ చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రూరల్ సీఐ నరేశ్కుమార్, వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్రెడ్డి, ఎస్సై సాయన్నలు దుకాణాలను తనిఖీ చేశారు. వానాకాలం సీజన్కు సంబంధించి దుకాణాల్లో ఉన్న ఎరువుల నిల్వలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు నష్టం జరుగకుండా జాగ్రత్తలు తీసుకునాలని దుకాణ యజమానులకు సూచించారు.

తొలగింపు నిర్ణయం సరికాదు



ఖలీల్వాడి: సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)లో వివిధ విభాగాల్లో పనిచేస్తూ 61 ఏళ్లు నిండిన వారిని తొలగిస్తామనడం అన్యాయమని ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్ అన్నారు. ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) ఆధ్వర్యంలో నగరంలోని కోటగల్లీలోని ఎన్ఆర్ భవన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేజీబీవీలో నాన్ టీచింగ్ వర్కర్లు పదహారేళ్లకు పైగా వెట్టిచాకిరి చేశారన్నారు. వీరికి కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు లేవన్నారు. ఇప్పుడు హఠాత్తుగా తొలగిస్తే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. తొలగింపు నిర్ణయాన్ని ఏడాది పాటు వాయిదా వేయాలని కోరాు. ఎస్ఎస్ఏ, కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి రూ.2 లక్షలు, వర్కర్లకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న, నాయకులు వెంకన్న, రమేష్, కిషన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

దూదిగాంలో తాగునీటి సమస్య



బాల్కొండ: మెండోరా మండలం దూదిగాంలో తాగు నీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్అండ్బీ ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్డు పనుల్లో కల్వర్టు నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టారు. దీంతో మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్తో పాటు, కాలనీల్లోకి సరఫరా అయ్యే తాగునీటి పైప్లైన్లు పగిలిపోయాయి. వీటిని మరమ్మతు చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు. ఫలితంగా గ్రామంలో నీటి సమస్య తలెత్తింది. దీంతో జీపీ వాటర్ ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేపట్టిన అందడం లేదు. దీంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీపీ నుంచే మరమ్మతులు చేపట్టాలని ఇటు ఆర్ అండ్బీ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ పగులగొట్టిన పైపులైన్కు కాంట్రాక్టర్రే మరమ్మత్తులు చేపట్టాలని జీపీ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో మరమ్మతులు జరగక నీటి సరఫరా కావడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



ఉపాధి హామీ పని ప్రదేశంలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మోపాల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మధ్యాహ్న భోజనం, ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు వంటి వసతులు కల్పిస్తామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని మంచిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పని ప్రదేశంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఉదయం సమయంలో ప్రజలు ఉపాధిహామీ పనికి వెళ్తుండటంతో ఇళ్లల్లో ఎవరూ ఉండటం లేదని గ్రహించి.. పని ప్రదేశానికి వెళ్లి బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. విద్యతో పాటు సమాజంపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిలు, శ్రీనివాస్, పరమేశ్వర్, పీఈటీ దేవేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్పై అవగాహన

నిజామాబాద్ నాగారం: బ్రెయిన్ ట్యూమర్పై అవగాహన పెంచుకోవాలని మెడికవర్ హాస్పిటల్ న్యూరోసర్జన్ డాక్టర్ కృష్ణాదిత్య సూచించారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని మెడికవర్ హాస్పిటల్లో శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. బ్రెయిన్ ట్యూమర్ వంటి తీవ్రమైన సమస్య గురించి ప్రజలు తెలుసుకోవాలన్నారు. బ్రెయిన్లోని కణితుల సమీపంలో కణజాలం, నిర్మాణాలలో వచ్చే గడ్డలు, కణాల పెరుగుదలనే బ్రెయిన్ ట్యూమర్ అంటారని చెప్పారు. వీటిలో కొన్ని కాన్సర్స్తో సంబంధం లేనివి ఉంటాయని వివరించారు. దీర్ఘకాలం పాటు రేడియేషన్కు గురయ్యే వారు, పొగతాగే వారు బ్రెయిన్ ట్యూమర్కు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. తీవ్రమైన తల నొప్పి, ఒత్తిడి, వికారం, వాంతులు, వస్తువులు రెండుగా కనిపించడం, సరిగ్గా మాట్లాడలేకపోవడం, మతిమరుపు ఈ వ్యాధి లక్షణాలు అని పేర్కొన్నారు. ఏమాత్రం అనుమానం వచ్చిన వైద్యులను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో హాస్పిటల్ హెడ్ స్వామి, మార్కెటింగ్ హెడ్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణాదిత్య

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



ఆర్మూర్: గల్ఫ్లోని బహ్రెయిన్లో నిర్వహిస్తు న్న క్రికెట్ పోటీల్లో హైదరాబాద్ క్రికెట్ జట్టుకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్రెడ్డి ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా క్రీడా దుస్తులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ రాజురెడ్డి మాట్లాడుతూ.. గల్ఫ్ దేశాల్లో క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు ఇక్కడి వారికి ఎమ్మెల్యే రాకేశ్రెడ్డి అండ గా ఉంటున్నారని పేర్కొన్నారు.

1,163 కేసుల పరిష్కారం

ఆర్మూర్టౌన్: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ను సీనియర్ సివిల్ జడ్జి నసీమా సుల్తాన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మెయింటెన్స్, సీసీ, సైబర్క్రైమ్, ఎక్సైజ్, పెట్టి, ఇతర కేసులను ఇరు వర్గాల రాజీతో 1163 కేసులు పరిష్కారమయ్యాయి. అనంతరం న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీనివాసరావు, న్యాయవాదులు, బార్అసోసియేషన్ సభ్యులు, బ్యాంక్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు నాసిరకం భోజనం

నిజామాబాద్ అర్బన్: పోటీ పరీక్షల శిక్షణ కోసం ఎస్సీ స్టడీ సెంటర్కు వస్తున్న విద్యార్థులకు నాణ్యతలేని భోజనం పెడుతున్నారని పీడీఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడారు. అభ్యర్థులకు మంచి భోజనం పెట్టాలని డిమాండ్ చేశారు. స్టడీ సెంటర్లో వసతులు కల్పించాలని కోరారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,400	వెండి (కిలో)	91,000
22 క్యారెట్స్	66,785		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్సేల్	రిటైల్		హోల్సేల్	రిటైల్
టమాట	30	50	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	70	90
బీరకాయ	40	70	దోసకాయ	25	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	30	40
బీర్నీసుకాయ	100	120	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	20	40
వంకాయ	25	50	బీట్రూట్	20	40
పాలకూర	30	50	కరివేపాకు	50	80
మెంతికూర	50	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	100	130	గోరుచిక్కుడు	50	80
పుదీనా	80	100	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	40	60			

– సుభాష్నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మనమే(తెలుగు) 10.50, 1.45, 4.40, 7.35, 10.30
స్క్రీన్-2	రక్షణ(తెలుగు)-10.25 గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు)-1.30 7.30 - సత్యభామ(తెలుగు)-4.30 భజేవాయువేగం(తెలుగు)- 10.30
స్క్రీన్-3	లవ్మౌళి(తెలుగు)-10.40 బాడ్బాయ్స్(తెలుగు)-1.45,7.45 రక్షణ(తెలుగు) 4.30 సత్యభామ(తెలుగు)-10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	మనమే(తెలుగు)-10.20, 10.20 ముంజ్య(హిందీ)-1.35 గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి(తెలుగు) -4.20 సత్యభామ(తెలుగు)-7.25
స్క్రీన్-2	బాడ్ బాయ్స్(తెలుగు)-10.30,4.30 మనమే(తెలుగు)- 1.15,7.15 బాడ్ బాయ్స్(ఇంగ్లీష్)- 10.30
స్క్రీన్-3	సత్యభామ(తెలుగు)-11.25 10.40 భజే వాయువేగం (తెలుగు)-2.20 వెపన్(తెలుగు)- 5.15 ముంజ్య(హిందీ)- 7.55
స్క్రీన్-4	గోల్డ్ నెం.1(తెలుగు)-10.30 లవ్మౌళి(తెలుగు)-1.20 గం..గం.. గణేశా(తెలుగు)-4.25 రక్షణ(తెలుగు)-7.30 గ్యాంగ్ ఆఫ్ గోదావరి(తెలుగు)- 10.30
దేవి	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు)
నటరాజ్	రక్షణ(తెలుగు)-11.00 6.00 వెపన్(తెలుగు)-2.00 9.00
విజయ్	మనమే (తెలుగు)